క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల పూర్తికి కృషి



జల్లూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కోటవురట్ల: పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీలను నిర్మిస్తోందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. జల్లూరులోని ఎస్సీ కాలనీలో ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెటీరియల్ అందుబాటులో ఉందని, బిల్లులు కూడా సకాలంలో విడుదల అవుతున్నాయని అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేశారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

రాంబిల్లి: ఈ నెల 10 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఇంటింటా ధర్మ ప్రచారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ కె. అప్పారావు కోరారు. రాంబిల్లిలో శనివారం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ ఎస్. నూకరాజు, కోకన్వీనర్ గగన్ పాల్గొన్నారు.

వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజుకు సత్కారం



సర్పంచ్ నూకరాజును సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

మునగపాక: వాడ్రాపల్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా వాడ్రాపల్లి ఎంపికైన నేపథ్యంలో శనివారం గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నూకరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అలాగే అధికారులు కూడా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పాటుపడతానన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు,పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

నక్కపల్లి : ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ తరగతులను శనివారం ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్ పరిశీలించారు. సప్లిమెంటరీ పరీక్షలకు హజరయ్యే విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల సిబ్బంది తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించే విధంగా బోధించడం జరుగుతుందని తెలిపారు.

తిమ్మరాజుపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్తేర్‌రాణి

మునగపాక : సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి కోరారు. తిమ్మరాజుపేటలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండవేడిమి తగలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ స్కూళ్ల సత్తా




అత్యధిక మార్కులు సాధించిన నాగ దుర్గ గొడిచర్ల, మౌనిక

నక్కపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సర్కారు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు తమ సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. నక్కపల్లి మండలంలో మొత్తం 11 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల, ఒక గురుకుల పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 1124 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 663 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 367 మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్‌లోను 198 మంది సెకెండ్ డివిజన్‌లోను, 98 మంది థర్డ్ డివిజన్‌లోను ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 58.9 శాతం వచ్చింది. గొడిచర్లలో పాఠశాలలో చదివిన నార్ని వెంకట దుర్గ అత్యధిక మార్కులు తెచ్చుకుని మండలంలో మొదటి స్థానం సాధించాడు. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన బోడ సత్యపావని, రెండో స్థానం సంపాదించింది. జానకయ్యపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన మామిడి వినీల మూడో స్థానంలో నిలిచింది.

పాఠశాలల వారీగా ఉత్తీర్ణత ఇలా...

జెడ్పీ ఉన్నత పాఠశాల డీఎల్ పురంలో 75 మందికి 49 మంది పాసయ్యారు. జెడ్పీహెచ్ పాఠశాల ఉద్దండపురం 40 మందికి 36 మంది పాసయ్యారు. రాజయ్యపేట ఉన్నత పాఠశాల (51 మందికి 29 మంది) దేవవరం ఉన్నత పాఠశాల నుంచి (38 మందికి 25), గొడిచర్ల ఉన్నత పాఠశాల (165 మంది 114), గురు ప్రైవేటు పాఠశాల నక్కపల్లి నుంచి (23 మందికి 18), నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల (110 మందికి 61), నక్కపల్లి ప్రభుత్వ బాలుర పాఠశాలనుంచి (177 మందికి 50), బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (78 మందికి 52), వేంపాడు ఉన్నత పాఠశాల (108 మందికి 79), చిన దొడ్డిగల్లు పాఠశాల (71మందికి 53), పెదబోదిగల్లం పాఠశాల (21 మందికి 8), నక్కపల్లి కేజీబీవీ (35 మందికి 21), జానకయ్యపేట పాఠశాల (132 మందికి 68) మంది పాసయ్యారు. ఈ ఏడాది ఫలితాల్లో ఉద్దండపురం పాఠశాల 90 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 40 మందికి 36 మంది పాసయ్యారు. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల బాగా వెనుకబడింది. ఈ పాఠశాలలో 177 మందికి కేవలం 50 మంది (28 శాతం ఉత్తీర్ణత) మాత్రమే పాసయ్యారు.

కోటవురట్ల మండలంలో..

కోటవురట్ల: సర్కారు బడుల్లో మాణిక్యాలు మెరిశాయ్..ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పది పరీక్షల్లో సత్తా చాటి ఇంటికి, బడికి, మండలానికి కీర్తిని తీసుకొచ్చారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు మండలంలోని 5 హైస్కూళ్లు, ఒక కేజీబీవీ పాఠశాల నుంచి 634 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. వీరిలో 500 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ చూపి మండలంలో టాపర్స్‌గా నిలిచారు. కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన శింగంపల్లి మౌనిక , జానకి నాగ హన్షిక , జల్లూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గుడివాడ హేమలత అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. మండలంలో 82 శాతం ఉత్తీర్ణత వచ్చినట్టు ఎంఈవో అప్పారావు తెలిపారు. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులను ఆయన అభినందించారు.

పేటలో 63.77 శాతం ఉత్తీర్ణత




అత్యధిక మార్కులు సాధించిన గట్టెం శ్రీరమ్య, కె.శ్రీరాజ్

పాయకరావుపేట : మండలంలో గల 12 ఉన్నత పాఠశాలల్లోను 773 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల రాయగా వీరిలో 493 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.ఎన్.గాంధీ తెలిపారు. 63.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. మండలంలో గల గుంటపల్లి ఉన్నత పాఠశాల్లో విద్యార్థి గట్టెం శ్రీరమ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.శ్రీరాజ్, సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థి సఖిలేటి సీతామహాలక్ష్మి అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానాల్లో వున్నట్లు ఎంఈవో గాంధీ తెలిపారు.

ఎస్.రాయవరంలో 82శాతం ఉత్తీర్ణత

ఎస్.రాయవరం : పదో తరగతి పరీక్షల్లో మండలంలో 82 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో మూర్తి తెలిపారు. మండలంలో 949 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 774 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారన్నారు. పాఠశాలల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. దార్లపూడి ఉన్నత పాఠశాల 88 శాతం, రేవు పోలవరం ఉన్నత పాఠశాల 51 శాతం, సైతారుపేట 86, లింగరాజు పాలెం జ్యోతిబాపూలే 100 శాతం, వినయ్ పాఠశాల 100 శాతం, శ్రీ ఆదర్శ పాఠశాల 97శాతం, ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల 96, లింగరాజుపాలెం ఉన్నత పాఠశాల 94, జెడ్పీహెచ్ఎస్ ఎస్.రాయవరం 90 శాతం, ఎస్.రాయవరం బాలికల ఉన్నత పాఠశాల 87 శాతం, కేజీబీవీ 86 శాతం, విశ్వశాంతి 86, ధర్మవరం అగ్రహారం 83 , పెదఉప్పలం 81 , పెదగుమ్ములూరు 76, వమ్మవరం 75, చిన గుమ్ములూరు 71, నారాయణపట్నం 67, కొరుప్రోలు 64, గుడివాడ 64 శాతంతో ఉత్తీర్ణత సాధించారన్నారు. వినయ్ ప్రయివేటు పాఠశాలలో కె. నాగవైష్ణవి 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని, ప్రభుత్వ పాఠశాలలో మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థిని ఎల్.రేష్మ 582తో మండల టాపర్‌గా నిలిచిందని తెలిపారు. ఉత్తీర్ణతలో బాలికలు 86 శాతం, బాలురు 76 శాతంగా ఉన్నారని తెలిపారు.

రాంబిల్లి మండలంలో 78శాతం ఉత్తీర్ణత

రాంబిల్లి : రాంబిల్లి మండలంలో పదో తరగతి ఫలితాల్లో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలకు చెందిన గొలగాని శ్యామల మండల టాపర్‌గా నిలవగా, దిమిలి ఉన్నత పాఠశాలకు చెందిన తేటకల నాగరాజు రెండో స్థానంలో నిలిచినట్టు ఎంఈవో తెలిపారు. శ్యామలను ఎంఈవో సూర్యారావు, హెచ్‌ఎంలు వేణుగోపాల్, ప్రసాదరావు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు వర్మ, లోవరాజు అభినందించారు.

మెరిసిన యలమంచిలి విద్యార్థులు





అత్యధిక మార్కులు సాధించిన పి.గాయత్రి, ఆర్.వెంకట చంద్రిక, షణ్ముక్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

యలమంచిలి : పదో తరగతి ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 75.5 శాతంతో ఉత్తీర్ణత సాధించారని, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 83.8 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి బి.విశ్వనాథం శనివారం తెలిపారు. యలమంచిలి పట్టణం, రూరల్ గ్రామాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 1015 మంది పరీక్షలు రాయగా 833 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.వి.తేజశ్విని అత్యధిక మార్కులు సాధించిందని తెలిపారు.యలమంచిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి.గాయత్రి, ఆర్.వెంకట చంద్రిక అత్యధిక మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు తెలిపారు. పాఠశాలలో 140 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 109 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

తోటాడ విద్యార్థుల విజయదుందుభి

మునగపాక : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మండల టాపర్‌గా మూలపేటకు చెందిన శరగడం షణ్ముక్ అత్యధిక మార్కులు సాధించాడు.అదే స్కూల్ నుంచి బొడ్డేడ పవన్‌తేజ మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తృతీయ స్థానంలో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన కె.ప్రజ్ఞ నిలిచారు. మండల వ్యాప్తంగా 604 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 494మంది ఉత్తీర్ణులయ్యారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 17మంది విద్యార్థులు, పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన 24 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఇదే స్కూల్ నుంచి కె.సౌజన్య అత్యధిక మార్కులు కై వసం చేసుకున్నారు.

వ్యవసాయ కుటుంబంలో చదువుల హారం..

మూలపేటకు చెందిన శరగడం రమేష్, అరుణ దంపతుల కుమారుడు షణ్ముక్ తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు రాసాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. షణ్ముక్ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడం పట్ల తల్లిదండ్రులతో పాటు హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని షణ్ముక్ తెలిపారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ




అత్యధిక మార్కులు సాధించిన జి.శ్రీరామ సంతోషి, కర్రి లీలావెంకట్

పాయకరావుపేట : ఎస్ఎస్‌సి -2023 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. తమ విద్యార్థుల్లో జి.శ్రీరామ సంతోషి అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని, పి.భువన ప్రణయ, జి.సాత్విక, ఎస్.సాత్విక, ఎస్.లక్ష్మి దుర్గ సాయి మణి కుమారి ఉత్తమ మార్కులు సాధించారని ఆయన తెలిపారు. 80 శాతం పైగా విద్యార్థులు 500 కి పైగా మార్కులు సాధించారని, మ్యాథ్స్, సైన్స్, సోషల్ తదితర సబ్జెక్ట్‌ల్లో 100 కి 100 మార్కులు 20 శాతం పైగా విద్యార్థులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సి.హెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు సీతారాణి, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

యలమంచిలి : పట్టణంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌కి చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ చూపారు. కర్రి లీలావెంకట్ అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచాడు. అలాగే బొద్దపు రవీంద్ర, కుప్పిలి నేహితకు అత్యధిక మార్కులతో సాధించారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడమే లక్ష్యం

- క్షేత్రస్థాయిలో విభేదాలకు తావులేకుండా చర్యలు
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, చిత్రంలో బొడ్డేడ ప్రసాద్, సుకుమారవర్మ

మునగపాక : రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు పేర్కొన్నారు. మా మధ్య ఎటువంటి గ్రూపులు లేవని, ఇక నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం మునగపాకలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ఎటువంటి ఆపోహలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగియగానే సచివాలయాల పరిధిలో పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే 72 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నియోజకవర్గంలో పూర్తి చేశామన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల మధ్య విభేదాలు లేకుండా ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సారథ్యంలో అంతా వైఎస్సార్ కుటుంబ సభ్యులుగా మెలిగేందుకు కృషి చేస్తామన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మునగపాక పంచాయతీ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలను బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలోనూ, మండలస్థాయిలో సమావేశం నిర్వహించేందుకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కార్యాలయం వినియోగించుకునేందుకు నిర్ణయించారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మునగపాక: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని పాటిపల్లి జగనన్న కాలనీని ఆమె శనివారం సందర్శించారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సాయం అందజేస్తామన్నారు. లబ్ధిదారులు సాధ్యమైనంతలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,ఎంపీడీవో రవికుమార్,సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చురుగ్గా రుద్రభూమి అభివృద్ధి పనులు

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ నిధులతో రుద్రభూమి అభివృద్ధి జరుగుతుంది.సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ సంబంధిత పనులను శనివారం పరిశీలించారు. రుద్రభూమిలోని పేరుకుపోయిన తుప్పలను తొలగించి శుభ్రం చేస్తున్నామన్నారు. సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ మందా రాము పాల్గొన్నారు.


రేపటి నుంచి ఉచిత యోగా

రావికమతం: బుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకోట హైస్కూల్‌లో సోమవారం నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు యోగా గురు నక్క రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఉచిత శిబిరంలో భాగంగా నిర్వహించే తరగతులకు అన్ని వయసుల వారు హాజరు కావచ్చని, ఆరోగ్యానికి అవసరమైన సునాయాస పద్ధతులలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

పోతురాజు స్వామి పండుగ నేడు

దేవరాపల్లి: తామరబ్బలో పోతురాజు స్వామి పెద్ద పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతరకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



మునగపాకలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మునగపాకలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వలంటీర్లు, అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మునగపాక బీసీ కాలనీలో డ్రైనేజీల ఏర్పాటుకు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తానన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగి ఉండి ఇంతవరకు ఎటువంటి సాయం అందకుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు పిల్లి అప్పారావు,ఆడారి కాశీబాబు,మొల్లే సంతోష్, ఆడారి సంతోష్‌కుమార్,బొడ్డేడ అప్పలనాయుడు,వేగి కృష్ణ, దాడి పోలీసు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



కోటవురట్లలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్



విజ్ఞాన శిబిరం గోడ పత్రికను విడుదల చేస్తున్న గ్రంథాలయాధికారి, అభివృద్ధి కమిటీ సభ్యులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలకు సంబంధించి గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమవుతుందని ఈ శిబిరం జూన్ 11వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు వేసవిలో పుస్తక పఠనం చేయాలని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.


8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

పాయకరావుపేట : ఈ నెల 8 వ తేదీ నుంచి గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులకు కథలు వినడం, పుస్తకాలు, చదవడం, పెయింటింగ్స్, వ్యాసరచన, ఇంగ్లిష్ చదవడం, డ్రాయింగ్, యోగా తదితర అంశాల పై నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరం గోడ పత్రికను విడుదల చేశారు.

మునగపాక శాఖాగ్రంథాలయంలో...

మునగపాక : మునగపాక శాఖాగ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన తరగతు లు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. చదివించడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి



కోటవురట్లలో ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల : ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సత్ఫలితాన్ని ఇస్తోందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శనివారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇంటర్ బోర్డు కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణులు కావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో పి.అప్పారావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో కోదండరామ స్వామి సహిత సీతారాముల ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు హాజరవుతారన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు.

వరిలో విత్తన ఎంపికపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏడీఏ దాసు

మునగపాక : వరిలో విత్తన ఎంపికపై రైతులు దృష్టి సారించాలని అనకాపల్లి డీఆర్‌సీ ఏడీఏ దాసు కోరారు. వాడ్రాపల్లిలో శనివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరిలో విత్తన ఎంపికతో పాటు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. తద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులను వినియోగించేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. డీఆర్‌సీ ఏవో తులసీ మట్టి నమూనాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఏవో జ్యోత్స్నకుమారి, ఏఈవో లక్ష్మి పాల్గొన్నారు.

సెలవుల్లో చదువును నిర్లక్ష్యం చేయొద్దు



గొల్లపేటలో పుస్తకం అందజేస్తున్న హెచ్‌ఎం జీవన్

కోటవురట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు సంస్కరణలు చేపట్టడమే కాకుండా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వేసవి సెలవుల్లో కూడా వారు చదువును అశ్రద్ధ చేయకుండా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీఏఆర్‌ఎల్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఓ పుస్తకాన్ని రూపొందించారు. సెలవుల్లో ఈ పుస్తకం చదివి చదువు పట్ల మరింత శ్రద్ధ కలిగేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక గొల్లపేట హెచ్‌ఎం జీవన్ శనివారం గ్రామంలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.